



మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు

మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా..
సీఆర్‌జడ్ అమలు చేయాలి

- తీరప్రాంత వాసుల విజ్ఞప్తి
- 'నోటిఫికేషన్'పై ప్రజాభిప్రాయ సేకరణ

కలెక్టరేట్, జూలై 25: మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా సీఆర్‌జడ్ అమలు చేయాలని తీరప్రాంత ప్రజలు కోరుతున్నారు. తీరప్రాంతాన్ని పరిరక్షించాలని, వలసల నివారణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఖరారు నిమిత్తం కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జడ్) నోటిఫికేషన్ విడుదలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.గణపతిరావు అధ్యక్షతన అధికారులు, తీరప్రాంత ప్రజలు సమావేశమయ్యారు. డీఆర్వో మాట్లాడుతూ.. సీఆర్‌జడ్ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు, సలహాలు తెలియజేయాలని, వాటిని రికార్డు చేసి ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. జిల్లాలోని 13 మండలాల పరిధిలో 158 గ్రామాలు.. సీఆర్‌జడ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. తీరప్రాంత వాతావరణాన్ని, స్థానిక సంఘాలు ఎదుర్కొనే ఇబ్బందులను రక్షించే ఉద్దేశంతో ప్రత్యేక సదుపాయాలు కల్పించేందుకు సీఆర్‌జడ్ అమలు జరుగుతుందన్నారు.

● మత్స్యకార సంఘ నాయకుడు.. కె.వి.జగన్నాథరావు మాట్లాడుతూ.. 'పైడిభీమవరం వంటి ప్రాంతాల్లో పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం, వ్యర్థాలు వాగుల ద్వారా సముద్రంలోకి ప్రవేశించి మత్స్యసంపదను, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా సీఆర్‌జడ్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి. కంపెనీల నుంచి వచ్చే హానికారక వ్యర్థాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి విడిచిపెడుతున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. మత్స్యకారులు వలసలు పోకుండా జెట్టీలను నిర్మించాలి. తీరప్రాంత భూములను మత్స్యకారులకే కేటాయించాలి' అని కోరారు. ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి తీర ప్రాంతాల్లో రోడ్లు వేస్తే టూరిజం అభివృద్ధి చెందుతుందని పలువురు పేర్కొన్నారు. గార మండలం బందరువానిపేట, మొగదలపాడు ప్రాంతాలనుంచి వలసలను నివారించడానికి హార్బర్ నిర్మించాలని కోరారు.

● సముద్రానికి 50 మీటర్లలో మత్స్యకార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని, 500 మీటర్లు దాటిన తరువాత టూరిజం, తదితరాలను నిర్వహించవచ్చని పొల్యూషన్ కంట్రోలు బోర్డు సుభాన్ వివరించారు. కార్యక్రమంలో డీపీవో వేంకటేశ్వరరావు, కొవ్వాడ డిప్యూటీ కలెక్టర్ ఎల్.లక్ష్మణరావు, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఏఈఈ హరీష్, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, టెక్కలి, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం తీర ప్రాంత గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం ఆలోచించాలి



మత్స్యకారులను ఆదుకొనేందుకు ప్రత్యామ్నాయం ఆలోచించాలి. చేపలవేటకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో మత్స్యకారులు ఖాళీగానే ఉంటున్నారు. గతంలో చేపల వేట లేని సమయంలో బియ్యం, పప్పులు తదితర నిత్యావసర వస్తువులను ఉచితంగా సరఫరా చేసేవారు. చేపల వేట నిషేధానికి సంబంధించిన భరోసా మొత్తాన్ని కూడా సకాలంలో అందజేయాలి.

- అల్లుపల్లి రాంబాబు, సర్పంచ్, బుడగట్లపాలెం



బందరువానిపేట తీరంలో అలల ఉధృతి

మత్స్యకారుల్లో అలజడి

- ముందుకొస్తున్న సముద్రం
- తుఫాన్ ప్రభావంతో నిలిచిన వేట
- ఆర్థికంగా తప్పని ఇబ్బందులు

(ఎచ్చెర్ల)

తుఫాన్లు, అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవగా.. మత్స్యకారులకు మాత్రం పస్తులు తప్పడం లేదు. కొద్ది రోజులుగా సముద్రంలో అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో చేపల వేట లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నెల 29 వరకూ సముద్రంలో చేపలవేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ మరోసారి హెచ్చరిక జారీచేయడంతో.. మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. వేటకు వెళితే కానీ.. పూట గడవదని, తమ జీవనాధారం ఎలా? అని సతమతమవుతున్నారు.

● జిల్లాలో ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ సుదీర్ఘ తీరప్రాంత ఉంది. లక్షలాది మంది మత్స్యకారులకు సముద్రంలో చేపలవేటే జీవనాధారం. కాగా ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో.. సముద్రంలో చేపలవేటకు వెళ్లేందుకు సాహసించడం లేదు. అధికారులు కూడా వేటకు వెళ్లొద్దంటూ హెచ్చరికలు జారీచేయడంతో ఇళ్లకే పరిమితమవుతున్నారు. కొన్నిచోట్ల అలల ఉధృతితో సముద్రం ముందుకు రావడంతో.. మత్స్యకారులు, తీరప్రాంత వాసులు భయాందోళన చెందుతున్నారు. ఈ నెల 20న వాయుగుండం కారణంగా కళింగపట్నంలోని కె.మత్స్యలేశం పోర్టు వద్ద మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీచేశారు. బందరువానిపేట వద్ద సముద్రం అలలు ఎగసిపడ్డాయి. కళింగపట్టణం, బారువ, బందరువానిపేట, కొవ్వాడ తీరాల వద్ద సముద్రం కొన్ని మీటర్లు ముందుకువచ్చింది. అలాగే బుధవారం కవిటి మండలంలోని తీర ప్రాంతంలో కూడా సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్ర కెరటాలు ముందుకు రావడంతో కొత్తపాలెం, పుక్కళ్లపాలెం, చిన్నకర్రివానిపాలెం గ్రామాల వద్ద తీరంలోని ఇసుక దిబ్బలు కోతకు గురయ్యాయి. తీర ప్రాంతంలో ఎక్కడ చూసినా అలల ఉధృతి కనిపిస్తుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సురక్షిత ప్రాంతాల్లో వలలు, పడవల్లు, తెప్పలు భద్రపరిచారు.

● ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో డి.మత్స్యలేశం, రాళ్లపేట, కొత్తమత్స్యలేశం, శివాజీ దిబ్బలపాలెం, పాతదిబ్బలపాలెం, బుడగట్లపాలెం, బడివానిపేట, పాతదిబ్బలపాలెం, జీరుపాలెం, కొవ్వాడ, అల్లివలస తదితర మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు వెయ్యి మందికిపైగా మత్స్యకారులు ఫైబర్ బోట్లు, నాటు పడవలపై చేపల వేట సాగిస్తున్నారు. ఫైబర్‌బోటుపై చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు మధ్యాహ్నం 3గంటలకు సముద్రంలోకి బయలుదేరుతారు. రాత్రంతా సముద్రంలోనే ఉండి వేట సాగిస్తారు. మరుసటి రోజు ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య ఒడ్డుకు చేరుకుంటారు. నాటుతెప్పలపై చేపల వేట సాగించే వారు తెల్లవారుజామున 3 నుంచి 4 గంటల మధ్య బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయానికి ఒడ్డుకు చేరుతారు. ఫైబర్ బోటుపై ఐదుగురు వరకు, నాటు పడవపై 8 మంది వరకు చేపల వేటకు వెళ్తారు. సముద్రంలో సుమారు 30 నుంచి 50 కిలోమీటర్ల వరకు వీరు ప్రయాణం చేసి చేపల వేట సాగిస్తారు. సముద్రంలో పది రోజులుగా నీటి ప్రవాహ దిశ అనుకూలంగా లేకపోవడంతో చేపల వేట సరిగా లేదని మత్స్యకారులు వాపోతున్నారు. ఇళ్ల వద్దే ఉంటున్నామని, ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ల సమయంలో తమను ఆదుకునేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు. కనీసం నిత్యావసర వస్తువులైనా అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు

అరసవల్లి, జూలై 25: సముద్రంలో చేపలవేటకు ఐదు రోజులపాటు వెళ్లొద్దని మత్స్యకారులకు వాతావరణ శాఖ హెచ్చరించింది. గురువారం నుంచి ఈ నెల 29వరకూ ఉరుములు, మెరుపులు, పిడుగులతో వర్షం కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. 40 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. మత్స్యకారులు ఎటువంటి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లొద్దని స్పష్టం చేసింది.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నగరాభివృద్ధిపై
ప్రత్యేక దృష్టి

- విలీన గ్రామాల్లో తాగునీటి సరఫరాకు రూ.106కోట్లు
- మిర్తిబట్టి ఆధునికీకరణకు రూ.40కోట్లతో రీ టెండర్లు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, జూలై 25: శ్రీకాకుళం నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి.. ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో తాగునీటి సరఫరా పనులకు రూ.106కోట్లతో ప్రతిపాదనలు రూపొందించాం. వీటికి త్వరలోనే టెండర్లు పిలుస్తాం. మొదటి దశలో పాత్రునివలస, పెద్దపాడు గ్రామాల్లో రూ.24 కోట్లతో ఇంటింటికీ తాగు నీటిని సరఫరా చేసేందుకు టెండర్లు సిద్ధం చేశాం. రానున్న మూడు నెలల్లో నగరపాలక సంస్థ డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠం చేస్తాం. అందులో భాగంగానే మిర్తిబట్టికి రూ.40కోట్లతో పనులకు రీ టెండర్లు పిలుస్తాం. సేవేజ్ ప్లాంట్ పనులను రూ.30కోట్లతో తిరిగి ప్రారంభిస్తామ'ని తెలిపారు. పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. '20 టన్నుల సామర్థ్యం గల మూడు టిప్పర్లను ఏర్పాటు చేసి, చెత్తను కాపులుప్పాడ పవర్ ప్లాంట్‌కు తరలించాలి. ఖాళీగా ఉన్న ప్రైవేటు స్థలాల యజమానులుకు పొద లు తొలగించాలని నోటీసులు పంపించాలి. ఖాళీ స్థలాలకు పన్ను వసూలు చేయాలి. ఆస్తిపన్ను మొండి బకాయిలపై దృష్టి పెట్టాలి. నీటిపన్నును పూర్తిస్థాయిలో వసూలు చేసి అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలి. నగర సుందరీకరణ, రివర్ ఫ్రంట్ అభివృద్ధి, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా తగిన ప్రతిపాదనలు రూపొందించాల'ని కలెక్టర్ తెలిపారు. సమీక్షలో కమిషనర్ ఓబులేసు, పబ్లిక్ హెల్త్ ఈఈ పొగిరి సుగుణాకరరావు, మునిసిపల్ ఇంజినీర్ గంగాధరరావు, ఇంజినీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డగోలుగా..

- జీజీహెచ్ సెక్యూరిటీ విభాగంలో అక్రమాలు
- రూ.లక్షల్లో వసూలు చేసి నియామకాలు?
- జీతాల్లో అనధికార కోతలతో ఇబ్బందులు


(అరసవల్లి)

శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్ - రిమ్స్), కళాశాలల్లో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది నియామకాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేసి.. సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలుస్తోంది. సెక్యూరిటీ గార్డు ఉద్యోగానికి రూ.2లక్షలు, సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఉద్యోగానికి రూ.4లక్షలు తీసుకున్నారని కొందరు సిబ్బందే వాపోతున్నారు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగానికి సాధారణంగా కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులైన వారినే తీసుకుంటారు. కానీ సుమారు 20 మందిని.. కనీస విద్యార్హత లేకపోయినా.. సెక్యూరిటీ గార్డులుగా నియమించారు. అలాగే సెక్యూరిటీ సూపర్‌వైజర్ పోస్టుల్లో మాజీ సైనిక ఉద్యోగులను మాత్రమే నియమిస్తుంటారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఆరుగురు సూపర్‌వైజర్లలో ముగ్గురు మాత్రమే మాజీ సైనిక ఉద్యోగులు. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు చేపడితే నిజానిజాలు వెల్లడవుతాయని సెక్యూరిటీ సిబ్బంది పేర్కొంటున్నారు.

● 'సెక్యూరిటీ గార్డుకు జీతం రూ.9,500 మాత్రమే ఇస్తున్నారు. పే-స్లిప్పులు ఇవ్వడం లేదు. జీతం తక్కువ ఎందుకు ఇస్తున్నారని అడిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నార'ని పలువురు వాపోతున్నారు. మొత్తం 132 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉండగా.. రోజుకు కనీసం పది మంది అయినా సెలవులో ఉంటారు. కానీ 132 మందికి బిల్లులు పెడుతున్నారని, సెలవు రోజులకు మాత్రం జీతాలు ఇవ్వడం లేదని తెలుస్తోంది.

● ఆ మతలబు ఏమిటో..

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా.. గత మూడేళ్లుగా సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు రూపాయి కూడా జీతం పెంచలేదు. ఈ విషయమై అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వామినాయుడు సమక్షంలో ఈ ఏడాది జనవరి నుంచి వెయ్యి రూపాయల జీతం పెంచుతామని అంగీకరించారు. ఇప్పటికీ జీతం పెంపు అమలుకు నోచుకోలేదు. గడువు తీరిపోయినా.. సాయి సెక్యూరిటీస్ సంస్థకు మరో ఆరు నెలలు పొడిగించారు. అయితే గత నాలుగు నెలలుగా సాయి సెక్యూరిటీస్ సంస్థ పేరున కాకుండా మెటా ఫోర్స్ అనే సంస్థ పేరున జీతాలు అందజేస్తున్నారు. సంస్థ పేరు మార్చి జీతాలు ఎందుకిస్తున్నారని అడిగితే.. సరైన సమాధానం లేదని సెక్యూరిటీ సిబ్బంది వాపోతున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇదే విషయమై సంస్థను ప్రశ్నిస్తే పేరు మార్చలేదని చెప్పడం గమనార్హం. మరి ఇందులోని మతలబు ఏమిటో వారికే తెలియాలి. అలాగే ఇప్పటికే అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్న సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు కూడా అందడం లేదు. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టరు వైసీపీ వ్యక్తి కావడంతో ఇన్నాళ్లు పలు ఇబ్బందులకు గురయ్యామని.. ఇకనైనా తమ గోడును పట్టించుకోవాలని వారు కోరుతున్నారు. అక్రమ నియామకాలపై దర్యాప్తు చేపట్టి నిజాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై సంస్థ ప్రతినిధిని వివరణ అడగా.. నిబంధనల ప్రకారమే నియామకాలు చేపట్టామని, జీతాలు అందజేస్తున్నామని తెలిపారు. ఆకవత వకలకు పాల్పడలేదని చెప్పడం గమనార్హం.



శ్రీకాకుళంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీవో సుదర్శనదొర

టెక్కలి ఆర్డీవోగా సుదర్శన్‌దొర

టెక్కలి, జూలై 25: టెక్కలి ఆర్డీవోగా బొమ్మాళి సుదర్శన్ దొర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ.. టెక్కలిలో ఇన్‌చార్జి ఆర్డీవోగా వ్యవహరించనున్నారు. సుదర్శన్‌దొరకు సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి నాగరాజు, సిబ్బంది, మండల టీడీపీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సబ్‌కలెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు

ఇప్పటివరకు సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన నూరుల్‌ఖమర్ ఆర్థిక శాఖ కార్యదర్శిగా అమరావతికి బదిలీ అయ్యారు. గురువారం ఆయనకు సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ.. దుశ్శాలువాతో సత్కరించి.. మెమొంటో అందించారు.

రొట్టవలస అగ్రికల్చర్ అసిస్టెంట్ సస్పెన్షన్

సరుబుజ్జిలి, జూలై 25: విధి నిర్వహణలో అలసత్వం కారణంగా రొట్టవలస గ్రామ సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.దుర్గారావును సస్పెండ్ చేసినట్టు మండల వ్యవసాయాధికారి బి.పద్మనాభం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుర్గారావు మద్యం తాగి విధులకు హాజరవుతూ ఎరువులు, ఇతర సరు కులు రైతులకు అందించడంలో నిర్లక్ష్యం వహించినట్టు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు అగ్రికల్చర్ ఏడీ విచారణ నిర్వహించి జేడీకి నివేదిక ఇవ్వగా, ఈ మేరకు సస్పెండ్ చేసినట్టు వెల్లడించారు.

28న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కలెక్టరేట్, జూలై 25: జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వేంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు.

ఈ-స్టాంప్స్ విక్రయాల్లో దోపిడీ!

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇష్టారాజ్యంగా వెండర్ల అదనపు వసూళ్లు

(నరసన్నపేట)

గతంలో నాన్ జ్యూడిషియల్ స్టాంప్‌లను ముద్రించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లేదా స్టాంప్ వెండర్స్ వద్ద విక్రయించేవారు. కాగా గత ప్రభుత్వ హయాంలో ఈ-స్టాంప్స్ విక్రయాలు చేపట్టారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వీటి విక్రయాలు పూర్తిగా నిలిపేశారు. దీంతో స్టాంప్ వెండర్స్ ఈ-స్టాంప్ విక్రయాలను సమీపంలో ఉన్న కంప్యూటర్ల కేంద్రాలకు ఇచ్చారు. వారు ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. నరసన్నపేటలో రూ.50 ఈ-స్టాంప్‌నకు రూ.80, రూ.100 స్టాంప్‌నకు రూ.150 చొప్పున వసూళ్లు చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే తాము చెప్పిన ధర ఇవ్వాల్సిందేనని వెండర్స్ స్పష్టం చేస్తున్నారు. కొంతమంది వెండర్స్ పాత తేదీలకు చెందిన నాన్ జ్యూడిషియల్ స్టాంపులను ఇళ్ల వద్ద ఉంచి.. ప్రస్తుతం అధిక ధరకు విక్రయిస్తున్నారు. వారి విక్రయాలు చేసే పుస్తకాల్లో రోజుకు రెండు, మూడు స్టాంపుల విక్రయాలు రాసేందుకు వీలుగా ఖాళీ ఉంచారు. దీంతో ప్రస్తుతం పాత స్టాంపులను రూ.5వేల నుంచి రూ.10వేల వరకు విక్రయిస్తున్నారు. నరసన్నపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక వెండర్ అంతా తానై వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ సమయంలో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తే వెండర్లు కార్యాలయంలో ఏ విధంగా వ్యవహరిస్తున్నారో.. కార్యాలయంలో ఎవరు తిష్ఠ వేస్తున్నారో.. తెలుస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులను సంప్రదించగా ఎవ్వరూ నోరు మెదపకపోవడం గమనార్హం.



మా కలలు నెరవేరాయి

- ఐదేళ్ల పోరాటం ఫలించింది
- అమరావతి రైతుల ఆనంద హేళ
- ఆదిత్యుడికి మొక్కుల చెల్లింపు

అరసవల్లి, జూలై 25: 'ఐదేళ్ల పోరాటం ఫలించింది. రాక్షస పాలన అంతమైంది. అమరావతి నిర్మాణ పనులు పునః ప్రారంభమయ్యాయి. మా కలలు నెరవేరాయి' అంటూ అమరావతికి భూములు ఇచ్చిన రైతులు ఆనందోత్సాహంతో ఆదిత్యుడికి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం ఉదయం అరసవల్లికి వారు చేరుకోగా.. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తండ్రి, మాజీ ఎంపీపీ గొండు జగపతి, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి గిరిజా శంకర్, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. టీడీపీ హయాంలో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు 33వేల ఎకరాలను ప్రభుత్వానికి ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి నిర్మాణం నిలిచిపోయింది. గత ఐదేళ్లలో ఆ రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో 2022 సెప్టెంబరు 12న అమరావతి నుంచి రైతులు పాదయాత్రగా అరసవల్లి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. రాజధాని అమరావతి నిర్మాణం జరగాలని, తమ పోరాటం ఫలించాలని మొక్కుకున్నారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగా.. అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో.. వారంతా గురువారం అరసవల్లికి చేరుకుని ఆదిత్యుడ్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అనివెట్టి మండపంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి రైతులు మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల తమ పోరాటం ఫలించినందుకు ఆనందంగా ఉందన్నారు. జగన్ పాలనలో మూడు రాజధానుల పేరిట అమరావతిని సర్వనాశనం చేసి, భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. దేవుడి దయ వలన మా కలలు ఫలించి, ప్రజలు వైసీపీకి గుణపాఠం చెప్పారని తెలిపారు. సీఎం చంద్రబాబు హయాంలోనే దేశంలోనే గొప్ప రాజధానిగా అమరావతి నిర్మాణం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని కోసం చేపట్టిన అమరావతి రైతుల ఉద్యమం మహిళలతోనే ప్రారంభమయ్యిందని, వైసీపీ పాలనలో ఎన్ని ఇబ్బందులు పడినా చివరకు విజయం సాధించామన్నారు. కార్యక్రమంలో ఉంగటి వెంకటరమణ, టి.జగదీష్, ఆర్.అర్జున్ పాల్గొన్నారు.



అరసవల్లిలో పూజలు చేస్తున్న అమరావతి రైతులు



అరసవల్లిలో అమరావతి రైతులకు స్వాగతం..

పోలవరం.. మూడేళ్లలో పూర్తి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం సకాలంలో పూర్తి చేయకపోగా.. నాశనం చేసిందని.. దరిమిలా రూ.30 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపే నిమిత్తం గురువారం సాయంత్రం అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేశారు. రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని, ఇందుకు కేంద్రం సహకరించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. పోలవరం పూర్తిచేసే బాధ్యతను కేంద్రం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 'ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే 960 మెగావాట్ల జల విద్యుత్కేంద్రం ఉత్పత్తిలోకి వచ్చేది. అది అందుబాటులోకి రాకపోవడం వల్ల చాలా ఎక్కువ ధరకు బయట నుంచి కరెంటు కొనాల్సి వస్తోంది. పంటలకు కూడా ప్రాజెక్టు నీరు అందుబాటులోకి రాలేదు. ఇవన్నీ లెక్కవేస్తే నష్టం రూ.30 వేల కోట్ల వరకు తేలుతోంది' అని చంద్రబాబు అన్నారు. ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల కాంటూరు.. మలిదశలో 45.72 మీటర్ల కాంటూరులో నిర్మాణాలంటూ సందేహాలకు తావివ్వకుండా.. గరిష్ఠ నీటి నిల్వ 196.40 టీఎంసీ మేర ప్రాజెక్టు నిర్మాణం సాగాలని.. ఆ మేరకు కేంద్రం సహకరించి నిధులివ్వాల్సిందిగా కోరదామని చెప్పారు. 'కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని కేంద్ర జల సంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా తీసుకున్న నిర్ణయం మేరకు.. కేంద్రం స్పందించి.. సకాలంలో ఆదేశాలు జారీ చేయాలి. కేంద్రం త్వరితగతిన నిర్ణయం తీసుకుంటే.. ఈ ఏడాది నవంబరు నుంచే పనులు ప్రారంభించే వీలుంటుంది' అని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం.

> పోలవరం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని కేంద్ర బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం శుభపరిణామం. రాష్ట్రానికి అన్ని విధాలా సహకరిస్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు.
>
> జగన్ వచ్చాక ఎగువ కాఫర్ డ్యాం పనులు చేయకుండా గ్యాప్‌లను అలాగే వదిలేయడంతో 2020 వరదలకు భారీ గుంతలు ఏర్పడి డయాఫ్రం వాల్ దెబ్బ తింది. పీపీఏ సూచించినా పూర్తి నిర్లక్ష్యం చేశారు. రెండేళ్లపాటు పనులే చేపట్టలేదు.

వెంటనే తిప్పికొట్టాలి..: తప్పుడు ప్రచారం చేయడంలో వైసీపీ ఆరితేరిందని, ఉపేక్షించకుండా అవసరమైన సందర్భాల్లో మంత్రులు తక్షణం వాటిని తిప్పికొట్టాలని కేబినెట్ నిర్ణయించింది. '2019 ఎన్నికల ముందు జగన్‌పై జరిగిన కోడి కత్తి దాడిని మనం పెద్ద సీరియస్‌గా తీసుకోలేదు. అలాగే బాబాయి హత్యను వాళ్ళు చేసి మనపై తోసివేసినా మనం అంత బలంగా స్పందించలేదు. వాటి ప్రభావం ఉండదనుకున్నాం. కానీ అవి ప్రభావం చూపాయి. ఈసారి ఎన్నికల ముందు జగన్‌పై గులకరాయి దాడి జరిగిన వెంటనే మనం స్పందించి అది డ్రామా అని విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాం. పెద్దఎత్తున ప్రచారం చేశాం. అప్పటికే జగన్ వ్యవహారాలు వారికి అర్థమై గులకరాయి దాడిని నమ్మలేదు. కొద్ది రోజుల క్రితం వినుకొండలో ఇద్దరు వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగి అందులో ఒకరు హత్యకు గురైతే.. జగన్ దానిని మన పార్టీకి పూయాలని చూశారు. రాష్ట్రంలో 36 రాజకీయ హత్యలు జరిగాయంటూ ఢిల్లీ వెళ్లి యాగీ చేయాలని చూశారు. చనిపోయిన వారి పేర్లు ఇవ్వాలని జాతీయ మీడియా అడిగితే సమాధానం చెప్పలేక జగన్ వెళ్లిపోయారు. ఇటువంటివి మనం కూడా అందుకోవాలి. ప్రతి దుష్ప్రచారాన్నీ తిప్పికొట్టాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ శ్రేణులు ప్రతీకార దాడులకు, కక్ష సాధింపు చర్యలకు దిగవద్దని తాను పదేపదే ఉద్దేశపూర్వకంగానే చెబుతున్నానని అన్నారు. 'జగన్ మనపై ఎన్నో దాడులు చేశాడు. చేయాల్సినంత అరాచకం చేశాడు. కానీ మళ్లీ గెలవగలిగాడా? వాళ్లు చేసిన అరాచకానికి చట్టప్రకారం శిక్ష పడేలా చూద్దాం. చట్టాన్ని మన చేతుల్లోకి తీసుకోవడం ఎందుకు? చట్టం తన పని తాను చేసుకుంటుంది' అని వ్యాఖ్యానించారు. కాగా... గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని కేబినెట్ ధ్రువీకరించింది.

ప్రతి మంత్రికి ఎంబీఏ ఎగ్జిక్యూటివ్

- ప్రతి పేషీలో 8 మంది ఉద్యోగులు

కేబినెట్‌లోని ప్రతి మంత్రికీ ఎంబీఏ చదివిన ఒక ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌ను పాలనా వ్యవహారాల్లో సహాయకారిగా నియమించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రుల పేషీల్లో ఉండాల్సిన సిబ్బందికి సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రుల పేషీల్లో సిబ్బంది నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలపాల్సి ఉండడంతో గురువారంనాటి సమావేశంలో సంబంధిత తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించారు. దీని ప్రకారం ప్రతి పేషీకి 8 మంది చొప్పున సిబ్బందిని మంజూరు చేశారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ పోస్టు కూడా ఉంది. గతంలో ఈ పదవి లేదు. దీనిని కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసి సూచనలు, సలహాలు ఇవ్వడం కోసం ఈ పోస్టును కొత్తగా సృష్టించారు. మంచి వారిని చూసి పేషీల్లో సిబ్బందిగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మంత్రుల కార్యాలయాల్లో ఆరోగ్యకర వాతావరణం ఉండాలని, శాఖాపరమైన అంశాలపై వెంటనే ప్రతిస్పందించే వారిని చూసి పెట్టుకుంటే ఫలితాలు బాగా ఉంటాయని తెలిపారు.



990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్!

- నిర్మాణానికి అనుమతివ్వండి
- పోలవరం తొలి దశ పనులకు తక్షణమే రూ.12,157 కోట్లివ్వండి
- కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ నిర్మాణంలో అత్యంత కీలకమైన డయాఫ్రంవాల్ దెబ్బతిన్నందున రూ.990 కోట్లతో కొత్త వాల్‌ను నిర్మించేందుకు రాష్ట్ర కేబినెట్ కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతి కోరింది. ప్రాజెక్టు తొలిదశ పనులు పూర్తిచేసేందుకు తక్షణమే రూ.12,157.53 కోట్లు అడ్వాన్సుగా విడుదల చేయాలని అభ్యర్థించింది. ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశంజరిగింది. 41.15 మీటర్ల కాంటూరులో తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని కేంద్రం రూ.30,436.95 కోట్లకు ఆమోదించిందని గుర్తుచేసింది. ఇందులో ఇంకా రూ.12,157.53 కోట్లు రావలసి ఉన్నందున ఈ మొత్తాన్ని అడ్వాన్సు రూపంలో ముందస్తుగా ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఇలా ముందస్తుగా నిధులు మంజూరు చేయడం దల్ల దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు నిర్మాణాన్ని పట్టాలెక్కించి త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుంటుందని పేర్కొంది. ఇక ప్రాజెక్టు రెండోదశలో 45.72 మీటర్ల కాంటూరులో 194.60 టీఎంసీలు నిల్వ చేసేలా పనులు చేపట్టేందుకు అంచనాలు సవరించాలని కోరింది. సవరించిన అంచనా వ్యయాన్ని త్వరలోనే కేంద్రానికి అందజేస్తామని తీర్మానంలో వెల్లడించింది. 'ఈ నెల 3న కేంద్ర జలసంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా ఆధ్వర్యంలో అంతర్జాతీయ నిపుణులతో, రాష్ట్ర ప్రభుత్వం, సెంట్రల్ సాయిల్-మినరల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు, కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో పాత డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేసే బదులు కొత్తది నిర్మించాలన్న నిర్ణయం జరిగింది. ఈ నేపథ్యంలో కొత్త వాల్ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇవ్వాలి. అలాగే పోలవరం ఎడమ కాలువ, కుడి కాలువల ద్వారా 8,123 క్యూసెక్కులు, 11,654 క్యూసెక్కుల వరద ప్రవాహ సామర్థ్యంతో నిర్మాణాలను చేపడతామని సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్నాం. ఇప్పుడు రెండు కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచేందుకు అనుమతి ఇవ్వండి. ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర పర్యావరణ, అటవీశాఖ తరచూ స్టాప్ వర్క్ ఆర్డర్ ఇస్తుండడం.. నిర్మాణానికి ఆటంకంగా మారింది. అందుచేత నిర్మాణ పనులపై నిషేధాన్ని శాశ్వతంగా ఎత్తివేయాలి' అని విజ్ఞప్తి చేసింది. కేబినెట్ ఇంకా ఏమని తీర్మానించిందంటే..

ఈ ఐదేళ్లలో విధ్వంసం..

2014-19 మధ్యకాలంలో పోలవరం ప్రగతి పరుగులు తీసింది. 2019 మేనాటికి 72శాతం పనులు పూర్తి చేశాం. కానీ 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టు విధ్వంసానికి గురైంది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎగువ కాఫర్ డ్యాం పనులు పూర్తి చేయలేదు. పీపీఏ సూచించిన రెండు గ్యాప్‌లు పూడ్చలేదు. 2019, 20ల్లో పనులే చేపట్టలేదు. భూసేకరణ పూర్తి చేయలేదు. గ్యాప్‌లు పూడ్చకపోవడంతో.. గోదావరి వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యాం పునాదులకు సమీపంలో భారీగుంతలు పడ్డాయి.

భారీ వరద కారణంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం గ్యాప్-1 వద్ద భారీగోతులు ఏర్పడ్డాయి. గ్యాప్-2 ప్రాంతంలోనూ భారీ గుంతలు పడ్డాయి. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలలో భారీగా సీపేజీ ఎగదన్నుతోంది. 500 మీటర్ల మేర నిర్మించిన గైడ్‌బండ్ కుంగిపోయింది. 2020 గోదావరి వరదల తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు నాలుగేళ్ల పాటు ముందుకు కదలకుండా నిలిచిపోయాయి. ప్రాజెక్టు సకాలంలో పూర్తికాక.. సాగు నీరందక రైతులు రూ.3,700 కోట్ల మేర పంట నష్టపోయారు. జలవిద్యుత్కేంద్రం సకాలంలో పూర్తికానందున 3,000 కోట్లు నష్టం వాటిల్లింది.

30 లక్షల ఎకరాలకు సాగునీరు..

పోలవరం ప్రాజెక్టును 194.6 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించాలని నిర్ణయించాం. దీనివల్ల 23.5 లక్షల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించడమే గాక కొత్తగా 7.2 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావచ్చు. తాగునీటి అవసరాలకు 4.9 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు 18.5 టీఎంసీలు వినియోగించుకునే అవకాశం ఉంది. జల విద్యుత్కేంద్రం ద్వారా 960 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి అవుతుంది. పోలవరం నిర్మాణ బాధ్యతను పూర్తిగా తీసుకుంటానని బడ్జెట్‌లో ప్రతిపాదించినందుకు కేంద్ర పభుత్వానికి ధన్యవాదాలు. 45.72 మీటర్ల కాంటూరు మేరకు 194.60 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నిర్మించాలన్న నిర్ణయానికి కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఇందుకు కేంద్రం పూర్తిగా సహకరించి అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలి.

డీటీ, ఐటీ వినియోగంలో ట్రాన్స్‌కోకు అవార్డులు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, ఐటీ వినియోగంలో ట్రాన్స్‌కోకు సౌత్ గోవ్‌టెక్ సింపోజియం అవార్డులు దక్కాయి. వినియోగదారుల విద్యుత్తు వాడకానికి సంబంధించి మీటరు రీడింగ్ అప్లికేషన్లలో ఐటీ వినియోగానికి గాను సౌత్ గోవ్ టెక్ 2024 అవార్డు దక్కింది. ఐటీ రంగానికి సంబంధించి ట్రాన్స్‌కో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ టెక్నాలజీలోనూ ఈ అవార్డును దక్కించుకుంది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నాయకత్వంలోని అధికారుల బృందం హైదరాబాద్‌లో బుధవారం రాత్రి సౌత్ గోవ్ టెక్ సింపోజియంలో అవార్డులను అందుకుంది. డిజిటల్ ట్రాన్స్‌మిషన్ ఎక్సలెన్స్ విభాగంలో జాయింట్ మీటర్ రీడింగ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఐటీ ఇన్నోవేషన్స్‌లో ఏపీ ట్రాన్స్‌కో అనుసరిస్తున్న విధానాలపై అవార్డు దక్కింది. ఈ అవార్డులను దక్కించుకున్నందుకు సీఎం చంద్రబాబు గురువారం ఇంధన శాఖ అధికారులను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై కట్టుదిట్టమైన చర్యలు

- ఆరోగ్యశాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశాలు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. గురువారం మంగళగిరి ఏపీఐఐసీ భవనంలో ఆరోగ్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై ఆయన సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రచార సాధనాల ద్వారా ప్రజలకు అవగాహన, ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా ప్రబలేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియాపై 24 గంటలూ పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై అక్రమ కేసుల ఎత్తివేతపై హర్షం

విజయవాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలపై వైసీపీ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను రద్దు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు గురువారం అసెంబ్లీలో ప్రకటించడంతో ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సతీష్, సీ మరియదాస్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చిరంజీవి, హృదయరాజు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిరంకుశ నిర్ణయాలను ప్రశ్నించినందుకు ఉద్యోగులు, అధికారులపై కేసులు నమోదు చేసిన విషయాన్ని శాసనభ సాక్షిగా ప్రపంచానికి తెలిపినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఐక్యవేదిక చైర్మన్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో సీపీఎస్ ఉద్యోగులపై నమోదైన కేసులను ఎత్తివేస్తున్నట్టు సీఎం అసెంబ్లీలో ప్రకటించడాన్ని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ-ఏపీజీఈఏ జేఏసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన జీపీఎస్ చట్టాలను కూడా అసెంబ్లీ వేదికగా రద్దు చేయాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

నందిగాం: నందిగాం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో టి.రాజారావుకు వినతి పత్రం అందించారు. కాలనీలో కొళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ నాలుగు ట్యాప్ లు పనిచేయడం లేదన్నారు. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎం.దాలయ్య, టి.యశోధ, ఎ.మహాలక్ష్మి తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరి

కరకవలస(ఎల్.ఎన్.పేట): ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీడీవో జి.గిరిబాల అన్నారు. కరక వలస గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్‌కార్డు నమోదు కేంద్రాన్ని గురు వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని శనివారం వరకు ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న ఆధార్ నమోదు కేంద్రాలు

పలాసరూరల్: పలాస మండలంలో నూతనంగా ఆధార్ నమోదు, అప్‌డేటేషన్, చేర్పులు, మార్పులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో నమోదు కార్యక్రమం సచివాలయం అధికారుల ఆధ్వర్యంలో చేపడుతున్నారు. గురువారం అల్లుకోల కేంద్రంలో 40 మంది వరకూ నూతనంగా నమోదు, చేర్పులు, ఫోన్ నెంబరు మార్పు చేపట్టారు. శుక్రవారం తర్లాకోటలో చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యమివ్వడం హర్షణీయం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

పాతపట్నం: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇచ్చి నిధులు మంజూరు చేయడం హర్షణీయమని టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ అన్నారు. ఎమ్మెల్యే ఎంజీఆర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలవరం, రాజధాని అమరావతి అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకరిస్తోందన్నారు. ఎన్డీఏ కూటమితో త్వరితగతిన రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి



వీరజవాన్లకు నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

టెక్కలి: జిల్లాకు చెందిన డొక్కరి రాజేష్, సనపల జగదీశ్వరరావు ఇటీవల సరిహద్దులో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందడం బాధాకరమని ఏఐవైఎఫ్ నేతలు అన్నారు. ఈ మేరకు గురువారం వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబాలకు తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబం లోని వ్యక్తులకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కార్య క్రమంలో సంస్థ నేతలు కిరణ్, ప్రేమ్‌చంద్, సాయికుమార్, మౌళి పాల్గొన్నారు.

- మత్తు పదార్థాలకు దూరంగా విద్యార్థులు, యువత ఉండాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. గుట్కా, ఖైనీల వ్యాపారం జోరుగా సాగుతోందని, వీటిపై పోలీసులు దృష్టి సారించా లన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మొజ్జాడ యుగంధర్, వాసు, శ్రీనివాస్, రవి, ప్రేమ్ చంద్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

మందస: మందస గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు, గణితం, ఇంగ్లీష్ ఉపాధ్యాయులను నియమించాలని గిరిజన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సవర సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు సవర ధర్మారావు, ఎన్.అప్పన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని పాఠశాల భవనాల నుంచి వర్షాలకు నీరు కారుతోందని, మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు డైనింగ్ హాల్ నిర్మించాలని, మరుగు దొడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కుక్‌లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సభ్యులు సవర పురుషోత్తం, సవర జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులు చట్టరీత్యా నేరం

మందస: మహిళలను లైంగికంగా వేధించడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ అధికారి వసుంధరాదేవి అన్నారు. మందసలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ కార్యాలయంలో కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళా సిబ్బందితో గౌరవంగా నడుచుకోవాలని, సమస్యలు వచ్చినప్పుడు సామరస్యంగా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రఘుపతిరావు, వైద్యాధికారి ఎం.సంపతిరావు, ఏపీఎం ప్రసాదబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్‌వీ రామలక్ష్మి, బి.మంగమ్మ పాల్గొన్నారు.

శివాలయం భూముల పరిశీలన



దేవాలయ భూములను పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని వసప గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయ భూములను దేవదాయశాఖాధికారులు గురువారం పరిశీలించారు. శివాలయానికి 19 ఎకరాల 70 సెంట్లు భూమి ఉందని, త్వరలో పూర్తి స్థాయిలో సర్వే చేపట్టనున్నట్లు వారు తెలిపారు. దేవాలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో పాత పట్నం, శ్రీముఖలింగం ఈవోలు వాసుదేవరావు, ప్రభాకర రావు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, ఎండోమెంట్ సర్వేయర్ ధ్రువప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం



కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: ఉద్యావన రైతులను ఆదుకుంటామని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. గురువారం రెయ్యిపాడులో అర్‌ఆర్ పథకం ద్వారా కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఉద్యాన పంటల అభివృద్ధి కోసం ఇప్పటికే ఎమ్మెల్యే గౌతు శిరీష సంబంధిత అధికారులతో మాట్లాడారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ, క్లష్టర్ ఇన్‌చార్జి కణితి సురేష్, అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యార్థులకు 'తల్లికి వందనం'పై హర్షం

మెళియాపుట్టి: ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు కూడా 'తల్లికి వందనం' పథకం వర్తిస్తుందని విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ప్రకటించడం హర్షణీయమని నియోజక వర్గ ప్రైవేటు పాఠశాలల సంఘం గౌరవాధ్యక్షుడు జేజేఎస్ ప్రతాప్ అన్నారు. గురువారం మెళియా పుట్టిలో సంఘం సమావేశం నిర్వహించి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం ప్రకటించారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థు లకు పథకం అమలుచేయడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు నల్లకాంతం చిన్నికృష్ణ, సుగ్గు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..



రిట్టపాడు వద్ద విద్యుత్‌వైర్లకు అల్లుకున్న గడ్డి తీగెలు

వజ్రపుకొత్తూరు: రిట్టపాడు గ్రామంలో విద్యుత్ వైర్లకు గడ్డి తీగెలు అల్లుకుని ప్రమాదకరంగా తయారయ్యాయి. విద్యుత్ స్తంభాల సమీపంలో ఆలయం ఉండడం, ఈ స్తంభాలు ఎప్పుడు పడిపోయి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ వైర్లపై గడ్డి తీగెల నుంచి అప్పుడప్పుడు మంటలు వస్తున్నాయని, తక్షణం సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మూలకు చేరిన వాటర్ ప్లాంట్

- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు
- పట్టించుకోని కేజీబీవీ సిబ్బంది

(జలుమూరు)



కేజీబీవీలో పనిచేయని వాటర్ ప్లాంట్

స్థానిక కేజీబీవీలోని వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 6 నెలలుగా వాటర్ ప్లాంట్ పనిచేయకపోయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ పాఠశాలలో ఆరు నుంచి 10వ తరగతి వరకు 200 మంది, ఇంటర్‌లో 50 మంది విద్యార్థినులు చదువుతున్నారు. కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులకు మినరల్ వాటర్ అందించేందుకు గాను రెండేళ్ల కిందట ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన నియోజకవర్గ నిధుల నుంచి నిధులను వెచ్చించారు. ఈ నిధులతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆరు నెలల కిందట వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైనా పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మినరల్ వాటర్ అందుబాటులో ఉంటే బాగుంటుందని పలువురు విద్యార్థినులు అభిప్రాయపడుతున్నారు. అయితే వాటర్ ప్లాంట్‌మూలకు చేరడంతో బోరు నీటిని అందిస్తున్నారని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. బోరునీరు తాగడం వల్ల వర్షాకాలంలో జలుబు చేసి జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను బాగుచేయించి పిల్లలకు మినరల్ వాటర్ అందించే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పాతపట్నంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయండి

- వైద్య ఆరోగ్యశాఖామంత్రిని కోరిన ఎమ్మెల్యే ఎంజీఆర్



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం ఇచ్చి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

శ్రీకాకుళం: నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంలో వైద్యసేవలు విస్తృతం చేసేందుకు వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. గురువారం అమరావతిలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో అత్యధికంగా గిరిజనులు, గ్రామాలున్నాయని వారికి వైద్య సేవలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గతంలో కొత్తూరుకు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు కాగా దానిని వైసీపీ ప్రభుత్వంలో పాలకొండకు తరలించారని, మరలా కొత్తూరులో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం ద్వారా కార్పొరేట్ వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లో అందించాలని కోరారు. పాతపట్నం ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిని నియమించి వైద్య సేవలను పెంపొందించాలని కోరారు.

ముత్యాలమ్మకోనేరు-నెహ్రూ పార్కు అభివృద్ధికి చర్యలు



వరద కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చైర్మన్, టీడీపీ నాయకులు, అధికారులు

పలాస, జూలై 25: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో మున్సిపాలిటీ నిర్వహిస్తున్న ముత్యాలమ్మ కోనేరు-నెహ్రూ పార్కు అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం చైర్మన్ బళ్ల గిరిబాబు, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, సప్ప నవీన్‌లతో పాటు అధికారులు కోనేరును పరిశీలించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. మొదటి పాలకవర్గంలో ఈ పార్కును ఎంతో సుందరంగా రూపొందించి నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వచ్చిన పాలకవర్గాలు పార్కు అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో పాడైంది. ఈ నేపథ్యంలో గురువారం కమిషనర్ టి.నాగేంద్రకుమార్, డీఈఈ కనకరాజు, ఏఈ అవినాష్‌తో కలిసి చైర్మన్, టీడీపీ నేతలు పార్కును పరిశీలించారు. ఎర్ర చెరువు, వర్షపు నీరు కాలువ ద్వారా వృథాగా పోకుండా చెరువులోకి మళ్లించేందుకు చర్య లు తీసుకోవాలని నిర్ణయించారు. చెరువులో పూడికలు తొలగించడంతో పాటు పార్కు చుట్టూ కంచె ఏర్పాటు, మొక్కలను పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పార్కుగా అభివృద్ధి చేస్తే సందర్శకులు పెరుగుతారన్నారు. కార్యక్రమంలో డి.నాగు, డొక్కర శంకర్. కొరికాన శంకర్, టీపీఎస్ అప్పలరాజు, ప్రేమ్ పాల్గొన్నారు.

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి యశ్వంత్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిరమండలం: వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు అన్నారు. గులుమూరు గ్రామంలో జ్వరాలు వ్యాప్తిపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'గులుమూరులో పెరుగుతున్న డెంగ్యూ బాధితులు' శీర్షికతో వచ్చిన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. గురువారం పంచాయతీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 1129 మందికి ఫీవర్ సర్వే చేసినట్లు చొర్లంగి పీహెచ్‌సీ వైద్యాధికారి యశ్వంత్ తెలిపారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. గ్రామంలో మురుగు నీటి నిల్వలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో యాళ్లనాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొట్టిపల్లి సచివాలయం తనిఖీ

కొత్తూరు: గొట్టిపల్లి సచివాలయాన్ని ఎంపీడీవో త్రివిక్రమరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాలకు చెందిన రికార్డులను పరిశీలించి సచివాలయం సేవలపై ఆరా తీశారు. విధుల నిమిత్తం బయటకు వెళితే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, మలేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో గాంధమ్మ సంబరం

నందిగాం: కవిటిఅగ్రహారంలో గురువారం గాంధమ్మ సంబరాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముర్రాటలు, ప్రసాదాలతో ఊరేగింపు నిర్వహించి గ్రామ సమీపంలోని గాయత్రీ మండపం పరిధిలోని గాంధమ్మ తల్లికి చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థు లంతా అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నాయీ బ్రాహ్మణుల కార్యవర్గం ఎన్నిక

హిరమండలం: హిరమండలం మండల నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తొత్తడిపూడి సాయి, ఉపాధ్యక్షుడిగా జి.రామకృష్ణ, కార్యదర్శిగా పి.వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా కె.శంకరరావు, కోశాధికారిగా యు.గోపినాథ్‌తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లా డుతూ సంఘాభివృద్ధికి పాటుపడతామన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు సూచించారు. గురువారం స్థానిక జోగంపేట పాఠశాలను పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులను ఆకర్షించేలా బోధన ఉండాలన్నారు. పాఠ్యప్రణాళికలు, టీఎల్‌ఎం ఉపయోగించాలన్నారు.

శ్రీవరి సాగుతో అధిక దిగుబడి

జలుమూరు: శ్రీ వరి సాగుతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి కె.సురేష్ తెలిపారు. అక్కురాడలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో శ్రీ వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వాసుదేవరావు, నవ్య, శివ చరణ్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాతపట్నం: రొంపివలస 33-11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని రొంపివలస, రొమదళ, రౌతులక్ష్మీపురం, రౌతుపురం, ఏఎస్‌కవిటి, చాకిపల్లి, బైదలాపురం, సీది, తామర, తీమర, సోదగూడలు, ఎస్ఎస్ మణుగు, నల్లబొంతు తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నౌతల ఫీడర్ పరిధిలో..

జలుమూరు, (సారవకోట): సారవకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ నౌతల ఫీడర్‌పై మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకరరావు తెలిపారు. దీనివల్ల నౌతల, నౌతల కూడలి, దాసుపురం, బొంతు, నారాయణపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గెస్ట్ అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గెస్ట్ అధ్యాపకులు పీజీ 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి నెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హతలు ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 31 న ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించనున్న ఇంటర్వ్యూకి సర్టిఫికేట్లతో హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

నరసన్నపేటలో 29న ఇంటర్వ్యూలు..

నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి సంబంధించి ఈనెల 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లత తెలిపారు. గణితం, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్‌లలో బోధించేందుకు గెస్ట్ అధ్యాపకులు ముందుకు రావాలన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 55 శాతం, ఎమ్మెస్సీ గణితంలో 55 శాతం, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ లేదా ఎంసీఏలో 55 శాతం మార్కులు పొంది నెట్ లేదా పీహెచ్‌డీ కలిగి ఉన్న అభ్యర్థులు సర్టిఫికేట్లతో ఈనెల 29న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరుకావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

సంతబొమ్మాళి: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం చేస్తాయని, అందువల్ల మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రిన్సిపాల్ సిరిపురం భీమేశ్వరరావు అన్నారు. గురువారం నౌపడ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి మొక్కలను నాటి వాటిని పెంచేందుకు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుమలరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లంపీ స్కిన్ వ్యాక్సిన్ లక్ష్యాలను అధిగమించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ లోకనాథం

జలుమూరు: పశువుల్లో వచ్చే లంపీ స్కిన్ వ్యాధి నివారణకు గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాల్లో వ్యాక్సిన్ వేస్తున్నామని, దీని లక్ష్యాలను అధిగమించాలని కోటబొమ్మాళి పశుసంవర్ధకశాఖ ఏడీ మంద లోకనాథం అన్నారు. సురవరం గ్రామీణ పశు వైద్యశాలను గురువారం సందర్శించి రికార్డులను పరిశీ లించారు. లంపీస్కిన్ వ్యాధి నివారణకు వేసే టీకాల డోసులు పశువైద్యశాలల్లో అందుబాటులో ఉంచామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్ర మంలో పశువైద్యాధికారులు పట్ట సంతోష్‌కుమార్, కె.నారాయణమూర్తి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

హరిపురం: లంపీస్కిన్ వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మందస పశు వైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. పిడిమందస పంచాయతీ మధ్యూరు గ్రామంలో గురువారం పశువులకు లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. వ్యాధి సోకిన పశువుల్లో తీవ్రమైన జ్వరం, శరీరంపై కణితిల్లా వచ్చి పుండ్లుగా మారుతాయన్నారు. దీనికి గాను వ్యాధి సోకిన రెండు రోజుల్లో చికిత్స అందించాలని సూచించారు. హరిపురం వైద్యాధికారి కిల్లి ఉమాభారతి పాల్గొన్నారు.

పాఠశాలల్లో సాంస్కృతిక దినోత్సవం

నందిగాం: శిక్షా సప్తాహ్‌లో భాగంగా గురువారం పాఠశాలల్లో సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు దేశభక్తి, జాతీయ సమైక్యతపై అవగాహన కలిగించారు. జాతీయ నాయకుల వేషధారణలు, దేశభక్తి గీతాలతో విద్యార్థులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పెద్దతామరాపల్లి పాఠశాలలో హెచ్ఎం కె.గున్నయ్య, ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బాలక శంకరరావు, వి.కుమారి, కె.తిరుపతిరావు తదితరుల సమక్షంలో జాతీయ సమైక్యతను కోరుతూ విద్యార్థులు నృత్య రూపకాన్ని ప్రదర్శించారు.









బైక్‌పై ముగ్గురు మైనర్లు.. వేగంగా వచ్చి ఢీకొట్టి..


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైం: నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ముగ్గురు మైనర్లు బైక్‌పై వేగంగా వస్తూ ఎదురుగా నడిచి వస్తున్న యువతిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సింగుపురం గ్రామానికి చెందిన పొట్నూరు హరిత ఆర్ట్స్ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతుంది. గురువారం కళాశాలకు వచ్చిన హరిత.. తరగతులు అనంతరం తోటి విద్యార్థులతో కలిసి బయటకు వెళ్తుండగా ముగ్గురు మైనరు విద్యార్థులు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తూ ఢీకొట్టారు. దీంతో హరిత రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ప్రమాదానికి కారణమైన ముగ్గురుని పట్టుకుని దేహశుద్ధి చేసి.. గాయపడిన యువతిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. హరితకు మొహంపై గాయాలు కాగా, ఎడమ మోకాలి కింద విరిగింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ అవతారం ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకుని, ముగ్గురు మైనర్ యువకులను అదుపులోకి తీసుకున్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న హరితను సీఐ పరామర్శించి, ప్రమాద ఘటనపై ఆరా తీశారు. ప్రస్తుతం యువతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

మైనర్లకు వాహనాలిస్తే క్రిమినల్ కేసులు: ఎస్పీ

ఆర్ట్స్ కళాశాల రోడ్డులో మైనర్ యువత ద్విచక్ర వాహనంపై ఓ యువతిని ఢీకొట్టిన విషయం తెలుసుకున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. అప్పటికే అక్కడ ఉన్న మైనర్ యువకులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపైన, ఇచ్చిన వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆ ముగ్గురు మైనర్ యువకులపై ట్రాఫిక్ సీఐ కేసు నమోదు చేయగా, బైక్ ఇచ్చిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేయనున్నట్లు చెప్పారు.

వ్యాన్ ఢీకొని యువకుడికి..

శ్రీకాకుళం క్రైం: లగేజీ వ్యాన్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని కాకివీధికి చెందిన వి.కుమారస్వామి బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై ఉమెన్స్ కళాశాల మీదుగా సూర్యమహల్ కూడలి వైపు వస్తుండగా.. వెనుక నుంచి వస్తున్న లగేజ్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో కుమారస్వామి కాలికి గాయం కాగా.. అతడిని స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ సందీప్‌కుమార్ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న వ్యాన్

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


మహ్మద్‌కు ప్రథమ చికిత్స చేస్తున్న 108 వాహన సిబ్బంది

లావేరు: సుభద్రాపురం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ షేక్ మహ్మద్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీని అదే వైపుగా వెళ్తున్న వ్యాన్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్ నడుపుతున్న షేక్ మహ్మద్ కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు స్పందించి అతడిని బయటకు తీసి రక్షించారు. ఈ ప్రమాదంలో మహ్మద్ రెండు కాళ్లు నుజ్జయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది అక్కడికి చేరుకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వజన ఆసుపత్రిలో మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆందోళన

శ్రీకాకుళం క్రైం: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుందామని వచ్చిన మహిళ మృతి చెందడంతో బంధువులు ఆందోళన చేపట్టిన ఘటన కలకలం రేపింది. వైద్యులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. లావేరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పిట్ట లక్ష్మి(31) కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకునేందుకు రిమ్స్ ఆసుపత్రిలో చేరింది. ఈ మేరకు బుధవారం ఆమెకు శస్త్ర చికిత్స చేశారు. ఇదే సమయంలో కడుపులో కాయ ఉందని తొలగించాలని లక్ష్మి కుటుంబ సభ్యులకు వైద్యులు చెప్పారు. దీంతో మరోసారి శస్త్ర చికిత్స చేసి ఆ కాయను తొలగించారు. ఈ క్రమంలో లక్ష్మి ఆరోగ్యం సాయంత్రం ఆరు గంటల నుంచి క్షీణించడంతో వైద్యులు అవసరమైన చికిత్స అందించారు. అయితే ఆమె పల్స్‌రేట్ పడిపోవడంతో తెల్లవారు గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో ఆమె మృతి చెందింది.

కుటుంబ సభ్యుల ఆందోళన

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స కోసం వస్తే.. రెండో ఆపరేషన్ చేశారని, వైద్యుల నిర్లక్ష్యం వల్లే లక్ష్మి చనిపోయిందంటూ ఆమె కుటుంబ సభ్యులు రిమ్స్ ఆసుపత్రి ఎదుట గురువారం ఉదయం ఆందోళన చేపట్టారు. వీరికి ఆసుపత్రిలో ఉన్న రోగులు, వారి బంధువులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని మద్దతు తెలపడంతో గందరగోళం నెలకొంది. రిమ్స్ సూపరింటెండెంట్ షకీల స్పందిస్తూ.. ఇది ప్రైవేట్ ఆసుపత్రి కాదని డబ్బులేమీ ఇవ్వరని తెలిపారు. లక్ష్మి మృతిపై అనుమానం ఉంటే విచారణకు ఆదేశిస్తానని చెప్పారు. తక్షణం పోస్టుమార్టం నిర్వహించాలని ఆమె ఆదేశించడంతో లక్ష్మి బంధువులు శాంతించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఫెయిల్ అయితే ఫ్యామిలీ ప్లానింగ్ ఫండ్ ద్వారా రూ.2 లక్షలు రిఫండ్ వస్తుందని దానికి రిఫర్ చేస్తామని చెప్పడంతో గందరగోళం సద్దుమనిగింది. దీంతో లక్ష్మి మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులు తీసుకుని వెళ్లిపోయారు.

సారా స్థావరాలపై దాడి

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో పూర్తిస్థాయిలో సారా తయారీ, విక్రయాలు అరికట్టాలనే లక్ష్యంతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు గురువారం పోలీసులు దాడులు చేపట్టారు. సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది.. మందస మండలం పట్టులోగాం గ్రామం పరిధి కొండ ప్రాంతంలో సారా తయారీ స్థావరాలపై దాడులు చేశారు. సారా తయారీకి వినియోగించే 1100 లీటర్ల బెల్లపు ఊటను, 20 లీటర్ల సారాను, ఇతర సామగ్రి ధ్వంసం చేశారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకుడి మృతి


అయ్యప్పల నాయుడు (ఫైల్)

లావేరు: చినమురపాక గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా టెలికం మాజీ సభ్యుడు, ఎచ్చెర్ల ఏఎంసీ మాజీ డైరెక్టర్ సరిపురపు అయ్యప్పలనాయుడు(75) అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈయన దివంగత మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడి అనుచరునిగా ఉండేవారు. కాగా ఈయన కుమారుడు సిరిపురపు రాంబాబు ప్రస్తుతం చినమురపాక ఎంపీటీసీగా సేవలందిస్తున్నారు.

జిల్లాకు చేరుకున్న నూతన జేసీ


కలెక్టర్‌ను కలిసిన అహ్మద్ ఖాన్

కలెక్టరేట్: జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం బదిలీపై జిల్లాకు చేరుకున్నారు. అన్నమయ్య జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై శ్రీకాకుళం వచ్చిన ఆయన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలెక్టర్ బంగ్లాలో గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం ఉదయం 10-00 గంటలకు బాధ్యతలు స్వీకరిస్తారు.

పూర్వ వైభవం వచ్చేనా?

- రూపుకోల్పోయిన కె.మత్స్యలేశం బీచ్
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి సర్కారు ఏర్పాటుతో చిగురిస్తున్న ఆశలు

(గార)

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కె.మత్స్య లేశం (కళింగపట్నం) బీచ్‌కి పూర్వ వైభవం తేవాలని పర్యా టకులు కోరుతున్నారు. బ్రిటిష్ వారి కాలంలో ఓడరేవుగా వర్తక, వ్యాపారులతో కళకళలాడిన ఈ ప్రాంతం... తర్వాత కాలంలో పర్యాటకులతో కనువిందు చేసింది. బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన లైట్ హౌస్ ఇప్పటికీ తన సేవలు అందిస్తూనే ఉంది. ఇంతటి చారిత్రక ప్రసిద్ధి చెందిన ఈ బీచ్‌ను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేశారు. దీంతో పర్యాటకుల సంఖ్య కూడా బాగా పెరిగింది. రెండు దఫాలుగా ఇక్కడ పెద్ద ఎత్తున బీచ్ ఫెస్టివల్స్ నిర్వహించారు. ఆ తర్వాత ఐదేళ్ల కిందట వంశధార నదికి వచ్చిన వరదల్లో బీచ్ రోడ్‌తోపాటు పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ఏనుగులు, ఒంటె, జిరాఫీ, బుద్ధుడు ఇతర బొమ్మలు కొట్టుకు పోయాయి. ఫలితంగా బీచ్ తన స్వరూపాన్ని కోల్పోయింది. ఆ తర్వాత బీచ్‌ను సందర్శించే పర్యాటకులు సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. క్రమేణా బీచ్ తన వైభవం కోల్పోయింది. సందర్శకులు పూర్తిగా రాకపోవడం వల్ల బీచ్ నిర్మానుష్యంగా మారింది. ఈ నేపథ్యంలో అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు బీచ్ కోతను అరికట్టి పూర్వ వైభవం తీసుకు రావడం కోసం రూ.7 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో బీచ్‌లో కొంతవరకు పనులు చేసి అక్కడితో వదిలేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఉండిపోయింది. ఆ తర్వాత ఆ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. జిల్లాలో ఎంతో చరిత్ర కలిగిన ఈ బీచ్‌కి పూర్వ వైభవం తీసుకురావాలని, ఇందుకు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆ శాఖ మంత్రి ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో మళ్లీ ఈ బీచ్‌కి పూర్వ వైభవం వస్తుందన్న నమ్మకం స్థానికుల్లో కలుగుతోంది. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్, కింజరాపు అచ్చెన్నాయుడు కూడా ప్రత్యేక కృషి చేసి నిధులు మంజూరు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


కోతకు గురైన బీచ్ తీరం


కళింగపట్నం తీరంలోని లైట్ హౌస్


నిరుపయోగంగా మిగిలిపోయిన కాటేజీ

అభివృద్ధి చేయాలి



జిల్లాలో ఎంతో చరిత్ర కలిగిన ఈ బీచ్‌కి పూర్వ వైభవం తీసుకురావాలి. ఇందుకు ప్రజా ప్రతినిధులు తగిన కృషి చేసి నిధులు మంజూరు చేయించాలి.

\- జేసీ దేవదాస్, టీడీపీ నాయకులు, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు, కె.మత్స్యలేశం

జగన్‌రెడ్డిని అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న బీవీ రామ్

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత 36 మంది ప్రాణాలు కోల్పోయారని మానసిక రోగిగా మారి నిరాధార ఆరోపణలు చేస్తున్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శవం కనిపిస్తే చాలు నాదే అంటూ శవ రాజకీయాలు చేస్తున్న జగన్‌కు ప్రజలు బుద్ధిచెప్పినా ఆయన మానసిక స్థితి మారలేదన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఇతోధికంగా వరాలు ప్రకటించిన మరుసటి రోజే రాష్ట్రం పరువు తీసేలా దేశ రాజధాని ఢిల్లీలో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గత ప్రభుత్వంలో స్పీకర్‌గా పనిచేసిన తమ్మినేని సీతారాం బాలాజీ మఠం భూముల ఆక్రమణలు, కొత్తరోడ్డు ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్స్ డబ్బులు తీసుకొని విద్యుత్ మీటర్లు ఇచ్చిన దురాగతాలపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు ఎన్ని శ్రీదేవి, డాక్టర్ పుష్పూర్ నికుంజ్, మెరుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు పెంచొద్దు

కంచిలి: ప్రజలకు నిత్యావసర సరుకుల ధరలు అందుబాటులో ఉండాలని జిల్లా పౌరసరఫరాల అధికారిణి బగాది శాంతిశ్రీ అన్నారు. ఈమేరకు మండల కేంద్రంలోని కిరాణా దుకాణాలను ఆమె సీఎస్‌డీటీ కూర్మారావుతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులతో మాట్లాడారు. కంది పప్పు, వంటనూనె ధరలు ఎక్కువగా పెంచి అమ్మకాలు జరిపినట్టు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కందిపప్పు రూ.160కు మించి అమ్మవద్దని సూచించారు. అనంతరం ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలించారు.

టిడ్కో కాలనీలో నగర కమిషనర్ పర్యటన


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం అర్బన్: పాత్రునివలస వద్ద గల టిడ్కో కాలనీలో డ్రైనేజీలు లేక ప్రజలు అవస్థలు పడుతుండటంపై గురువారం నగర పాలక కమిషనర్ చల్లా ఓబులేసు పర్యటించారు. డ్రైనేజీల నిర్మాణానికి కావాల్సిన పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. డ్రైనేజీ నిర్మాణానికి కావాల్సిన నివేదికను అందించాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే ఆదివారంపేట, అయ్యప్పకాలనీల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

ఐసీడీటీతో బీఆర్ఏయూ ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపిస్తున్న వీసీ రజని తదితరులు

ఎచ్చెర్ల: డ్రోన్ రంగంలో శిక్షణ నిర్వహణ, సామాజిక అనుసంధాన అధ్యయన కోసం రోసిన్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన ఇన్నోవేటివ్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ (ఐసీడీటీ)తో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ సంస్థ ఏయూతో ఒప్పందం కుదుర్చుకుని పలు అధ్యయనాలు చేసిందన్నారు. ఈ ఒప్పందంతో వర్సిటీలో డ్రోన్ ఫ్లైయిట్ రంగంలో శిక్షణ ఇవ్వొచ్చన్నారు. రోసిన్ సంస్థ సీఈవో ఎస్‌కేవీ సతీష్ మాట్లాడుతూ 6 నుంచి 50 రోజుల వ్యవధి గల స్వల్పకాలిక శిక్షణ తరగతులు త్వరలో వర్సిటీలో ప్రారంభిస్తామన్నారు. ఈ శిక్షణ అనంతరం వ్యవసాయ, టెలికాం, భవన నిర్మాణ రంగాల్లో పనిచేసే అవకాశం వస్తుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి 18-65 ఏళ్ల లోపు వారు ఈ శిక్షణ తీసుకునేందుకు అర్హులని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఐసీడీటీ అధ్యక్షుడు ఓఆర్ఎం రావు (విశాఖ) తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

పొందూరు: మాదకద్రవ్యాల(డ్రగ్స్)కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఆమదాలవలస సీఐ దివాకర్‌యాదవ్ అన్నారు. స్థాని ఓ ప్రైవేట్ కళాశాలలో గురువారం మత్తు పదార్థలు వాడకం వల్లే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎస్ఐకు ప్రశంసా పత్రం

పొందూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రేణుక డీజీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. విధుల్లో చూపిన ప్రతిభకుగాను రాష్ట్ర డీజీపీ ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ మేరకు డీజీపీ నుంచి వచ్చిన ప్రశంసాపత్రాన్ని సీఐ గురువారం ఏఎస్ఐ రేణుకకు అందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఈవీ రమణ, ఏఎస్ఐ రామచంద్రరావు సిబ్బంది ఉన్నారు

తులసిగాంలో జనసేన సభ్యత్వ నమోదు

ఇచ్ఛాపురం: జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి ఆధ్వర్యంలో గురువారం తులసిగాం పంచాయతీలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో శంకర్, మాధవ్, చిరంజీవి, లక్ష్మణ్, మోహన్, లాజర్, మధు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ షెల్టర్ పరిశీలన


పరిశీలిస్తున్న ఆర్డీవో

సోంపేట: రామయ్యపట్నం గ్రామంలోని తుఫాన్ షెల్టర్‌ను పలాస ఆర్డీవో భరత్ నాయక్ గురువారం పరిశీలించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో తుఫాన్ షెల్టర్‌ను సిద్ధం చేసి ఉంచాలని తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ కవిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్గిల్ వీరుల త్యాగాలు మరువలేనివి

- నగరంలో కాగడాలతో భారీ ర్యాలీ


కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ పార్టీల ప్రజలు, నాయకులు

గుజరాతీపేట: కార్గిల్‌లో వీరులు త్యాగాలను గుర్తుచేసుకుంటూ నగరంలో గురువారం రాత్రి కాగడాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా శాఖ, యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ భారత మాతకు జేజేలు పలుకుతూ.. యువతలో దేశభక్తిని రగిలించేలా జాతీయ జెండాను చేతపట్టి నినాదాలు చేశారు. ఈ నెల 26వ తేదీన కార్గిల్ దివస్‌గా యువతతో పెద్ద ఎత్తున సెమినార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ర్యాలీ ఏడు రోడ్ల కూడలి ప్రారంభమై సూర్య మహల్ కూడలిలోని వివేకానంద విగ్రహం వరకు నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, బీజేవైఎం యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి, నాయకుడు పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జీ, ఎస్.ఉమామహేశ్వరి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, జనసేన నుంచి కిషోర్, రమణ, ఎన్‌సీసీ(14) ఆంధ్రా బెటాలియన్ ముఖ్య అధికారి మేజర్ మహేష్, మాజీ సైనిక సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

28న బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికలు


శ్రీకాకుళం స్పోర్ట్స్: స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో ఈ నెల 28వ తేదీన రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పురుషులు, మహిళల జిల్లా జట్లకు ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ధర్మాన రామలింగం నాయుడు, కార్యదర్శి సాధు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హాజరవు తున్న క్రీడాకారులు పురుషులకు 84 కిలోల బరువు, మహిళలకు 75 కిలోల బరువు వరకు ఉండాలని, వయస్సు నిబంధన లేదని స్పష్టం చేశారు. క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరు కావాలని, ఇందులో ఎంపికైన క్రీడాకారులు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు జరగనున్న పోటీల్లో పాల్గొంటార న్నారు. ఆసక్తి గల క్రీడాకారులు జిల్లా ఎంపికల స్థలంలో కార్యదర్శి సాధు శ్రీనివాస రావు వద్ద రిపోర్టు చేయాలన్నారు.

చిన్నారులకు నాట్య మయూరి అవార్డులు


అవార్డులతో చిన్నారులు, జ్ఞాన సరస్వతి అవార్డు అందుకుంటున్న సంగీత కళాకారుడు

ఇచ్ఛాపురం: ఆల్ ఇండియా జూనియర్ నృత్య కూచిపూడి పోటీల్లో పట్టణానికి చెందిన స్వేచ్ఛా నృత్య తరంగిణి చిన్నారులు ప్రతిభ చూపి నాట్య మయూరి అవా ర్డులు అందుకున్నారు. ఈ నెల 24న నృత్యమాల నాట్య కళ వెల్ఫేర్ సొసైటీ వారి ఆ ధ్వర్యంలో బోనాల ఉత్సవాలు సందర్భంగా ఆల్ ఇండియా నృత్య ప్రదర్శనలు హైద రాబాదులోని రవీంద్రభారతి వేదికగా జరిగాయి. ఈ సందర్భంగా నాట్య మయూరి అవార్డులను యశ్విత, శరణ్య, సంజన, భూమిక, లావణ్య, అనుశ్రీ, అందుకున్నారు. అకాడమీ అధ్యక్షుడు గోవింద్ సత్కరించి మెమెంటో అందజేశారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అలాగే ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ఆశి కృష్ణారెడ్డి సంగీత కచేరి ప్రదర్శనలకు జ్ఞాన సరస్వతి అవార్డు అందజేశారు.

కొత్త క్రిమినల్ చట్టాలు నిలిపివేయాలి


కోర్టు బయట నిరసనలు తెలుపుతున్న న్యాయవాదులు

ఇచ్ఛాపురం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాలను వ్యతిరేకిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. గురువారం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో బార్ అధ్యక్షుడు నందికి రమణయ్యరెడ్డి ఆధ్వర్యంలో బార్ సభ్యులు, న్యాయవాదులు నిరసనలు తెలిపారు. ఇలాంటి చట్టాలు వద్దని వీటిని కేంద్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బార్ కార్యదర్శి ఎన్‌వీఎస్ రంగారావు, ట్రెజరర్ ఆర్.దేవరాజ్, న్యాయవాదులు దక్కత కృష్ణమూర్తిరెడ్డి, గిన్ని సీతయ్యరెడ్డి, మనోజ్‌కుమార్, తారక రామారావు, వరలక్ష్మి, బైరాగిరెడ్డి, ఎస్ఎస్ పాడి, ప్రసాద్, సూర్యనారాయణ న్యాయవాదులు పాల్గొన్నారు.

రత్తకన్నలో ఎన్ఎస్‌టీపీ కర్మాగారం నిర్మించొద్దు

ఇచ్ఛాపురం: రత్తకన్న గ్రామం 18వ వార్డు పరిధిలో గల స్థలంలో ఎన్ఎస్‌టీపీ (మురుగు నీటిని శుద్ధిచేసే కర్మాగారం) నిర్మాణం చేపట్టొద్దని ఆ వార్డు ప్రజలు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఆ వార్డు సంతోషం వీధి చివరిలో ఉన్న ఖాళీ స్థలాన్ని గతంలో వినాయక యువజన సంఘం(సంతోషం వీధి) పేరున 1996లో రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారన్నారు. ఆ స్థలం చుట్టూ పునాదులు కూడా వేసి, వార్డు ప్రజలకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు జరుపుకుంటున్నార న్నారు. ఇప్పుడు అదే స్థలంలో మురుగునీరు శుద్ధి కర్మాగారం నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమైందని, ఆ స్థలంలో కాకుండా వేరొక స్థలంలో ఎన్ఎస్‌టీపీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సీహెచ్ జగన్నాయకులు, గ్రామ పెద్దలు గిన్ని సీతయ్యరెడ్డి, జి దేవరాజ్, భీమయ్య, కె పితాంబర్‌రెడ్డి, గిరి, బాలరాజు, చంద్రశేఖర్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా పద్మారావు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా వర్సిటీ రసాయన శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.పద్మారావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను వీసీ కేఆర్ రజని గురువారం అందజేశారు. అంబేడ్కర్‌పై లోతైన పరిశోధనలు, ప్రచురణలు చేయాల్సిన బాధ్యత ఈ కేంద్రానిదని ఆమె స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్ఛాపురం: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ పనులు చేపట్టడంతో శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాల్టీ పరిధిలో గల హాస్పటల్ రోడ్, కార్జీవీధి, రథంవీధి, మంగళవారంపేట, రూరల్ పరిధిలో డొంకూరు, కేశుపురం, తిప్పనపుట్టు, మండపల్లి గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

- **సోంపేట:** సోంపేట ఫీడర్ పరిధిలో నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ జి.ప్రసాదరావు తెలిపారు. సోంపేట ఫీడర్‌లోని సోంపేట, జింకిభద్ర, బెంకిలి, కొర్లాం ఫీడర్ పరిధిలో కొర్లాం రూరల్, బ్రాహ్మణకొర్లాం, నూకలూరు, పాలవలస, కర్తలిపాలెం తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు నిలిపివేస్తున్నామన్నారు.
- **జి.సిగడాం:** మండల పరిధిలో గల పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం కలగనున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు, ఏఈ జి.తిరుపతిరావు తెలిపారు. బాతువ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం పున్నాం, యల్లయ్యపేట, ఉల్లివలస, డీఆర్ వలస, సర్వేసుపురం, రౌతుపేట, మునినివలస, ముఖ్యపేట తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

11న జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 11వ తేదీన పెద్దపాడు గ్రామం అప్పన్నమ్మతల్లి ఆలయ సమీపంలో గల రెయ్యం తల్లి వ్యాయామశాలలో వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్స్, జూనియర్స్ సబ్‌జూనియర్స్ విభాగాల్లో పురుషులు, మహిళలు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, జనన ధ్రువపత్రం/ ఆధార్‌కార్డుతో హాజరై శిక్షకులు ఇప్పిలి అప్పన్నకు రిపోర్టు చేయాలని కోరారు.

విధిగా హెల్మెట్ ధరించాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి మణి

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి అన్నారు. గురువారం కోర్టు ప్రాంగణంలో హెల్మెట్ వాడకంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీపీ సీపాన గోవిందరావు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పైడి వరహానరసింహం, న్యాయవాదులు బొడ్డేపల్లి మోహన్‌రావు, తమ్మినేని అన్నంనాయుడు, అన్నెపు సత్యం, గరుగుబిల్లి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హత గల సంఘాలకు రుణాలు

ఇచ్ఛాపురం: అర్హత కల్గిన ప్రతీ సంఘానికి రుణాలు మంజూరు చేయనున్నట్టు యూనియన్ బ్యాంక్ మేనేజర్ లీలంత్ మిశ్రా అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఎస్.ప్రసాద్ అధ్యక్షతన సంఘాలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్, ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ డి శోభన్‌బాబు, 35మంది వీఓఏలు , సీసీలు , అకౌంటెంట్ పాల్గొన్నారు.

అంగర్గత ఆడిట్ తప్పనిసరి

ఆమదాలవలస: మహిళా సంఘాలు ఏ అవసరం కోసం లోన్లు వాడుతున్నారు, వాడుకున్న అప్పులతో ఏయే కార్యక్రమాలు చేస్తున్నారు.. పుస్తక నిర్వహణ సక్రమంగా ఉన్నది లేనిది తీర్మానాలు సరిగా రాసుకున్నది తెలుసుకొనేందుకు అన్నిసంఘాలకు అంతర్గత ఆడిట్ తప్పనిసరిగా చేయించాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి సిబ్బందికి సూచించారు. గురువారం బొబ్బిలిపేట గ్రామ సంఘంలో అధ్యక్షురాలు పైడి వనజాక్షి ఆధ్వర్యంలో సంఘాల రికార్డులను పరిశీలించారు. కార్య క్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభ ద్ర, వీవోఏ గొండు శ్యామల, గ్రామ సంఘం ప్రతినిధులతో పాటు స్వయం శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నీలమ్మ తల్లికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పెద్దబరాటం వారి వీధిలో ఉ న్న నీలమ్మతల్లి అమ్మవారి ఆవేటి వారాలు గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు కిరణ్ శర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరి దేవిగా అలంకరించారు.